# తిక్కచావు

అన్నగారి కూతురు వెంకటలక్ష్మి పెళ్ళి పేరు చెప్పి, గౌరీనాథం గారు, ఆయన అల్లుడు రమణయ్యా, ఆయన చుట్టాలు అంతా ఒకచోట కలుసుకోవడం తటస్థించింది. రమణయ్య కోపిష్ఠి, తిక్కమనిషి అనీ, పెళ్ళాన్ని చావగొట్టి, చీటికి మాటికి వదిలేస్తానని; బెదరిస్తాడనీ, చిన్న చిన్న విషయాలకు పేచీ పెంచుకుని ఉగ్రుడై పోతాడని అందరికీ తెలుసు. పెళ్ళికి వచ్చిన జనమంతా రమణయ్యను చూసి బెదురుతూ దూరంగా ఉండసాగారు. అందుచేత రమణయ్య ఒంటరిగా కాలక్షేపం చెయ్యవలసి వచ్చింది. తన ఎదురుగుండా పెళ్ళివారంతా ఖులాసాగా ఉండడం, తాను ఒంటరిగా ఉండడం, రమణయ్యకు ఉడుకుమోతుతనం కలిగించింది. పలకరించినా, అతనిదగ్గరికి ఎవ్వరూ రావడం మానేశారు.

పెళ్ళివారంతా తననుంచి దూరంగా ఉండడానికి కారణం తన మామగారే అందరికీ తాను తిక్కమనిషని చెప్పి ఉంటాడని అనుమానం కలిగింది. నల్గురిలోనూ మామగారిని అభాసుచేసి, అందరి సానుభూతి తను పొందాలని రమణయ్య నిశ్చయించుకున్నాడు.

పెళ్ళి హడావుడిలో కంగారుగా తిరుగుతున్న గౌరీనాథంగారి దగ్గరికి రమణయ్య వెళ్ళి 'మామగారూ! మీతో చాలా జరూరు పనుంది' అన్నాడు కోపంగా. గౌరీనాథంగారు పెళ్ళి హడావిడిలో అన్యమనస్కులై వినిపించుకోలేదు. మళ్ళీ రమణయ్య రెట్టించి కోపంగా పిలిచేసరికి గౌరీనాథంగారు హడలుతూ 'ఏమిటోయి రమణయ్యా' అన్నారు. 'నా పెళ్ళిలో మీకు నాలుగు వందలు రూపాయిలు దాచమని యిచ్చాను. అవి తక్షణం నాకు కావాలి' అన్నాడు రమణయ్య. 'ఆ డబ్బు బ్యాంకులో వుంది. కావాలంటే రెండు రోజుల్లో యిస్తాలే' అన్నారు గౌరీనాథంగారు.

'మీరు ఎప్పుడూ యిల్లానే అంటున్నారు. డబ్బు బ్యాంకులో వేశాననకపోతే, వాడేసుకున్నానని చెప్పరాదూ? అన్నాడు రమణయ్య పేచీ పెంచుతూ.

గౌరీనాథంగారి మనస్సు చివుక్కుమంది. నిజంగా ఆయన డబ్బు బ్యాంకిలో వేశాడు. రమణయ్య ఏదో ఉద్యోగం చేస్తున్నాడు గదా, ఈ డబ్బుకూడా యిస్తే ఖర్చు పెట్టేస్తాడని, ఆయన యివ్వడం ఆలస్యం చేయడం మొదలుపెట్టారు. అల్లుడు తనమీద డబ్బు తినేసే నింద వేస్తాడని అనుకోలేదు.

'నీ డబ్బు తప్పకుండా రెండు రోజులలో యిస్తానోయి!' అన్నారు గౌరీనథంగారు

నెమ్మదిగా.

రమణయ్య అరిచాడు. 'నా డబ్బు తక్షణం నా కిచ్చివేయండి. లేకపోతే నాకీ సంసారం అక్కరలేదు. మీ పిల్లని మీరు తీసుకుపొండి' అని రుసరుసలాడుతూ జందాలు పుటుక్కున తెంపేసి, గల్లంతు చేయసాగాడు. పెళ్ళివారంతా చుట్టూ మూగారు. కొందరు మొదట గౌరీనాథం గారు డబ్బు వాడేసుకున్నారేమో అని రమయణయ్యమీద జాలి చూపారు. రమణయ్య పెళ్ళి పందిటిలో జందాలు తెంపేసి, పిల్లతో కాపురం చెయ్యనని బెదిరిస్తోంటే కొందరు పెద్ద మనుష్యులకు కోపంవచ్చి, 'ఏమిటోయ్ రమణయ్యా, ఆయన రెండు రోజులలో డబ్బిస్తానంటూంటే ఈ గందరగోళం ఏమిటి?' అని నాల్గు చీవాట్లు వేశారు. రమణయ్యకు మరీ కోపం వచ్చింది. పెళ్ళి జనమంతా తన మామగారి పక్షం మాట్లాడుతున్నారని.

ఇది పనిగాదని రమణయ్య ధుమధుమలాడుతూ ప్రక్కనున్న బంధువుల ఇంటికి వెళ్ళిపోయాడు. రాత్రి భోజనంకు రమ్మని ఎంతో మంది ఎన్నోవిధాల బ్రతిమాలారు. కాని రమణయ్య 'ససేమిరా' అని మొండి పట్టుపట్టి, పడుకున్నాడు. మొండి మనిషిని, యింక సమాధానపరచడం కష్టమని ఎవరూ రమణయ్యను భోజనం చెయ్యమని గట్టిగా పట్టు పట్టలేకపోయారు.

తెల్లవారగానే రమణయ్య మంచంమీద మూల్గుతూ ఉన్నాడు. ఎవరువచ్చి పలకరించినా మాట్లాడడం మానేశాడు. చూపు వంకర తిరిగింది. కాళ్ళు చేతులు నిటారుగా కర్రల్లా ఉన్నాయి పళ్ళు బిగిసిపోయి, పెదిమలు ముడుచుకుపోయాయి. ఈ స్థితిలో రమణయ్య కనిపించేసరికి అతని బంధువులకు భయం వేసి, గౌరీనాథంగారి దగ్గరకు పరుగెత్తుకు వెళ్ళి ఏమండోయ్! మీ అల్లుడి పరిస్థితి ప్రమాదకరంగా ఉంది. చనిపోతున్న లక్షణాలు కనిపిస్తున్నాయి అన్నారు. గౌరీనాథంగారు హడలిపోయారు. అల్లుడికి ఇంతలో ఏమి ముంచుకువచ్చిందని కంగారుగా, పెళ్ళి యింట్లో పని మానేసి రమణయ్య దగ్గరకు పరుగెత్తారు. ఈ సంగతి విని పెళ్ళివారంతా గౌరీనథంగారి వెంబడి నడిచారు.

రమణయ్య మంచంమీద మూల్గుతూ ఉన్నాడు. పళ్ళు పటపటలాడుతున్న శబ్దం వినిపిస్తోంది.

'ఏమిటోయ్ రమణయ్య!' అన్నారు గౌరీనథంగారు.

రమణయ్య గట్టిగా మూల్గడం మొదలు పెట్టాడు.

'చ...చ్చి...పో...తు...న్నా...ను' అని నసుగుతూ, బాధతో అన్నాడు రమణయ్య.

'రాత్రి భోజనం మానేయడంవల్ల నీరసంగా ఉందేమో! కాస్త కాఫీ త్రాగు' అన్నారు గౌరీనథంగారు.

రమణయ్య మాట్లాడలేదు. మరీ బాధగా మూల్గడం మొదలుపెట్టాడు. రమణయ్య పెదిమలు బిగిసిపోయి ఉండడంవల్ల గౌరీనాథం గారు కాఫీకూడా అతని గొంతుకలో పోయలేకపోయారు. బంధువులు ఎవరు పలకరించినా రమణయ్య గట్టిగా మూల్గటం తప్ప సమాధానం యివ్వడం మానేశాడు. ఇది చూసి నిజంగా రమణయ్యకు ఆఖరి ఘడియలు దగ్గర పడ్డాయనుకుని కొందరు బంధువులు పాపం! రమణయ్య ఎంతమంచివాడు, 'చనిపోతున్నాడు!' అని సానుభూతి చూపించారు.

రమణయ్య మూల్గు మరీ ఎక్కువైంది. ఇది చూసి గౌరీనాథం గారు హడావిడిగా పోయి ఆ ఊళ్లో వున్న డాక్టరును పిలుచుకు వచ్చారు.

డాక్టరుగారు రమణయ్యను ఆపాదమస్తకం పరీక్ష చేశారు. ఆయనకు చనిపోయేటంతటి రోగలక్షణా లేవీ రమణయ్యలో కనిపించలేదు. నాడి చూస్తే, కొద్ది నీరసం చూపించినా, పొతకలా కొట్టుకుంటూంది. రమణయ్య మూల్గు క్రమంగా ఎక్కువైపోతూంది.

డాక్టరుగారికి రమణయ్య రోగానికి ఏ మందు యివ్వాలో అర్థం కాలేదు అయినా నీరసం తగ్గడానికి మందు కలిపి నోట్లో పొయ్యబోయారు. రమణయ్య పెదిమలు గట్టిగా బిగించబడి ఉన్నాయి. ఎంత శక్తి ఉపయోగించినా, రమణయ్య నోరు పెకలలేదు.

డాక్టరుగారికి పిచ్చివాళ్ళకుకూడ చికిత్స చేయడం తెలుసు. తన ఆసుపత్రిలోని వాళ్ళెవరైనా మందు త్రాగక అల్లరిచేస్తే, గట్టిగా తన్ని, మందు తాగించడం ఆయనకు అలవాటు. ఆ అలవాటైన పద్దతిలో, డాక్టరుగారికి ఏమీ తోచక, రమణయ్య రోగం బాగా అర్ధంకాక, బలవంతాన అతన్ని కూర్చోపెట్టి, ఎడా పెడా, నాల్గువేళ్ళూ అంటుకునేటట్టు చెంపలు గట్టిగా వాయించారు 'మందు త్రాగమని' అరుస్తూ.

అంతవరకూ చనిపోయే లక్షణాలు చూపిస్తున్న రమణయ్య 'బాబోయి డాక్టరుగారూ! కొట్టకండి. బాబోయి! మందు త్రాగుతా!'ని మంచం మీదనుంచి గబుక్కున లేచి ఒక్క గెంతు గెంతాడు. ఈ విచిత్రం అంతా చూసి, పెళ్ళివారు గొల్లుమని నవ్వసాగారు.

డాక్టరుగారికి రమణయ్య రోగం గబుక్కున అర్థం అయింది. ఇది ఒక విధమైన తిక్కగాని మరేమీ గాదని, యింకో రెండు గుద్దులు గుద్ది, బలవంతాన భోజనం

తినిపించి, రమణయ్య నీరసం పోగొట్టారు.

పదిమందిలోను రమణయ్య చూపిన విచిత్ర ప్రవర్తన చూసి గౌరీనాథంగారు 'ఇటువంటి అల్లుడు నా ఖర్మకొద్దీ దొరికాడని' బాధపడి విస్తుపుచ్చుకున్నారు. 'నీ అల్లుడికి ఏ రోగం లేదోయి. దొంగరోగంకాని' అన్నారు డాక్టరుగారు నవ్వుతూ గౌరీనాథంగారితో. రమణయ్యను చూసి, పెళ్ళివారంతా ఫక్కుమని అదే నవ్వడం మొదలుపెట్టారు. పెళ్ళివారంతా మెల్లిగా వెళ్ళిపోయాక 'ఈ గొడవంతా ఏమిటి రమణయ్యా' అని నేనడుగుతే చచ్చినట్లు నటిస్తే, నాకు మామగారు డబ్బు యివ్వక పోవడం వల్ల బెంగతో చచ్చిపోతున్నానని అందరూ ఆయన్ని చీవాట్లు పెడతారనుకున్నాను గాని, డాక్టరు వచ్చి యిల్లా చావగొడతాడనుకోలేదు' అన్నాడు. రమణయ్య వెర్రిమొగం పెట్టి, తేలుకుడితే దవడ మీద కొట్టి కొంతమంది మంత్రం వేస్తారు చూశావూ, అట్లాగా డాక్టరుగారు కూడ ఒక్క దవడ దెబ్బతో నీ చావుకు మంత్రం వేశారు బావా!' అంటూ గౌరీనాథంగారి అబ్బాయి రమణయ్యను వేళాకోళం చేశాడు.